## తిరుపతి జిల్లాలో సిట్ విచారణ

హైదరాబాద్, మే 19 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల అనంతరం జరిగిన హింసాత్మక ఘటనల నేపథ్యంలో తిరుపతి జిల్లాలో పలుచోట్ల సిట్ బృందం విచారణ చేపట్టింది. జిల్లా కేంద్రంలోని ఎస్వీయూ, పద్మావతి మహిళా యూనివర్సిటీతో పాటు చంద్రగిరి మండలం కూచువారిపల్లె, రామిరెడ్డిపల్లెలో సిట్ అధికారులు పలువురిని విచారించారు. కూచువారిపల్లెలో వైసీపీ అభ్యర్థి మోహిత్‌రెడ్డి గన్‌మెన్ ఈశ్వర్, గ్రామస్థులను విచారించారు. రామిరెడ్డిపల్లె సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డి ఇంటిని సిట్ అధికారులు పరిశీలించారు. టీడీపీ అభ్యర్థి పులివర్తి నానిపై హత్యాయత్నం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించింది. సిట్ బృందం నివేదికను ఈసీకి అందజేయనున్నది.

## విద్యుత్తు షాక్‌తో మహిళ మృతి

- తెల్లారితే ఇంట్లో పెండ్లి.. అంతలోనే విషాదం
- సంగారెడ్డి జిల్లా పుల్కల్‌లో ఘటన


గంగమ్మ (ఫైల్)

పుల్కల్, మే 19: తెల్లారితే ఆ ఇంట్లో పెండ్లి భాజాలు మోగాల్సి ఉంది. కానీ.. విధి వక్రీకరించి చావు డప్పు మోగింది. ఇంట్లో విద్యుత్తు షాక్ తగిలి ఓ మహిళ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఈ విషాదకర ఘటన ఆదివారం సంగారెడ్డి జిల్లా పుల్కల్‌లో చోటుచేసుకుంది. పుల్కల్‌కు చెందిన మ్యాతరి గంగమ్మ (41) చెల్లెలి కూతురు దివ్య వివాహం సోమవారం మెదక్‌లో జరగాల్సి ఉంది. కుటుంబసభ్యులు అందరూ పెండ్లి పనుల్లో నిమగ్నమై ఉన్నారు. ఈ క్రమంలో ఇంటి ముందర గోడపై ఉన్న మీటరు వైరుకు చేయి తాకడంతో ఆమెకు కరెంటు షాక్ తగిలింది. దీంతో గంగమ్మ అక్కడికక్కడే మృతిచెందింది. గంగమ్మ మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులు, బంధువులు బోరున విలపించారు. పుల్కల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గంగమ్మ మృతదేహానికి పంచనామా నిర్వహించి.. పోస్టుమార్టం నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతురాలి కూతురు నందిని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై వెంకటేశం తెలిపారు.


**Format C-2**

(For political party to publish in website, newspapers, TV)

Declaration about criminal antecedents of candidates set up by the party

(As per the judgment dated 25th September, 2018 of Hon'ble Supreme Court in WP(Civil) No. 536 of 2011 (Public Interest Foundation & Ors.Vs.Union of India & Anr.)

Name of the Political Party : **BHARAT RASHTRA SAMITHI**

Name of the Election : **BYE- ELECTIONS TO TELANGANA LEGISLATIVE COUNCIL FROM WARANGAL-KHAMMAM-NALGONDA GRADUATES' CONSTITUENCY-2024**

**Name of State/~~UT~~ :** **TELANGANA**

| 1 | 2 | 3 | 4 | | 5 | | |
|---|---|---|---|---|---|---|---|
| Sl. No. | Name of Constituency | Name of Candidate | (A) Pending Criminal cases | | (B)Details about cases of conviction for criminal offences | | |
| | | | Name of Court, case No. & Status of the cases(s) | Sections of the Acts concerned & brief description of offence(s) | Name of Court & date(s) of orders(s) | Description of offence(s) & Punishment imposed | Maximum Punish-ment Imposed |
| 1. | WARANGAL -KHAMMAM-NALGONDA GRADUATES' | **RAKESH ANUGULA** | 1. Crime No.512/2023 P.S.Subedari, Hanumakonda District C.C.No:889/2024 IIIrd Addl. JFCM, Hanumakonda Accused No.1 | Sec. 143, 147, 148, 452, 535 R/w 149 of IPC Allegation of forming un-lawful assembly with an intention to house trespass and assault to deter a public servant from discharging of his duty | 29.12. 2023 CC.No: 2647/2020 Junior Civil Court Warangal-I | U/S. 143, 149, 188, 341, 504, 506 Allegation of defamation, making false statement, rumour etc circulated with intend to cause mutiny or offence against the public peace and criminal intimidation | Rs. 1500/- Fine imposed and paid |
| | | | 2.Crime No.258/2018 P.S. Hasanparthy, Hanumakonda District CC.No:246/2019 Principal JFCM Hanumakonda Accused No.2 | Sec. 188 of IPC Allegation of disobedience to an order lawfully promulgated by a public servant | | | |
| | | | 3.Crime No.20/2021 P.S.Matampally, Suryapet District Not Yet Numbered Judl.First Class Magistrate, Huzurnagar | Sec. 143, 144, 147, 148, 323 R/w 149 IPC Allegation of forming un-lawful assembly with an intention to causing hurt to deter a public servant from discharging of his duty | | | |
| | | | 4.Crime No.6/2022 One Town, Karimnagar Police Station Not Yet Numbered | Sec. 153, 500, 505 (2) & 506 of IPC Allegation of defamation, making false statement, rumour etc circulated with intend to cause mutiny or offence against the public peace and criminal intimidation | | | |
| | | | 5. Crime No.1/2021 P.S.Matwada, Warangal District Not Yet Numbered | Sec.341, 447, 143 R/w 149 of IPC Allegation of forming un-lawful assembly and conducted Dharna in front of KMC and obstructed employee in entering into KMC, Warangal | | | |
| | | | 6. Crime No.7/2022 One Town, Karimnagar Police Station C.C.No:717/2022 IInd Addl.JFCM Karimnagar | Sec.188 IPC and Sec.51 (B) of Disaster Management Act Allegation of disobedience to an order lawful promulgated by a public servant and refuse to comply with any direction given by or on behalf of the Central Government | | | |

*In the case of election to Council of States or election to Legislative Council by MLAs, mention the election concerned in place of name of constituency

Sd/- **Signature of the Officer bearer of the Political Party**

**Name and Designation: SOMA BHARATH KUMAR**

**General Secretary**

**BHARAT RASHTRA SAMITHI**

**Telangana Bhavan, Road No.10, Banjara Hills, Hyderabad-500034.**


అతడి పేరు రాము. ఫైనాన్స్‌లో ఆటో కొన్నాడు. నెలనెలా రూ.8,500 ఈఎంఐ చెల్లిస్తున్నాడు. ఏడాది గడిచింది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఉచిత బస్సు ప్రవేశపెట్టడంతో గిరాకీ లేదు. దీంతో ఇల్లు గడవటమే కష్టంగా ఉన్న రాముకు ఈఎంఐ చెల్లించటం భారంగా మారింది. రెండు నెలల కిస్తీ చెల్లించకపోవటంతో ఫైనాన్షియర్లు వాళ్ల టీంలను పంపించి రామును బెదిరింపులకు గురిచేస్తున్నారు. కిస్తీ కడతావా? చస్తావా? అంటూ వేధిస్తున్నారు. ఆటోను వదిలేస్తే ఇన్ని రోజులు చెల్లించిన ఈఎంఐలు వృథా అయినట్టే. అప్పు తెచ్చి ఈఎంఐ చెల్లిస్తే మళ్లీ వాటిని తీర్చే పరిస్థితి లేదని ఆవేదన చెందుతున్నాడు.

జాఫర్.. ఆటో ఈఎంఐ చెల్లించడం లేదని ఫైనాన్షియర్లు జప్తు చేశారు. అప్పటికే 14 ఈఎంఐలు చెల్లించిన అతడి బతుకు రోడ్డుపాలైంది. ఇంట్లో తన భార్య ఆభరణాలను కుదువపెట్టి డబ్బులు చెల్లించాడు. అయితే మూడు నెలలు ఆలస్యమైనందకు మొత్తం లోన్ మీద వడ్డీ, మూడు నెలల ఈఎంఐ, రౌడీషీటర్లకు రూ.5 వేల మామూళ్లు ఇలా ఇవ్వాల్సి వచ్చిందని చెప్పాడు. ఆటోపై ఆధారపడి బతికానని, ఇలాంటి పరిస్థితి వస్తుందని ఊహించలేదని వాపోయాడు.

# కిస్తీ కడ్తవా? చస్తవా?



## ఆటోడ్రైవర్లకు ఫైనాన్షియర్ల తీవ్ర వేధింపులు

- అప్పు చెల్లించాలంటూ ఆటోల జప్తు.. అడిగితే రౌడీలతో దాడులు
- ఫ్రీ బస్సుతో గిరాకీ కోల్పోయిన డ్రైవర్లు.. ఈఎంఐలు కట్టలేక తిప్పలు
- మా మొర వినే వారేరి? విన తులకు దిక్కేది?.. బతకడమే భారమైంది
- ఆత్మహత్యలకు కారణం కాంగ్రెస్ సర్కారే.. ఆటోడ్రైవర్ల ఆవేదన

*హైదరాబాద్ సిటీబ్యూరో, మే 19 (నమస్తే తెలంగాణ): రోజురోజుకు ఆటోడ్రైవర్ల జీవన పరిస్థితి క్షీణిస్తున్నది. ఉచిత బస్సు స్కీంతో రోడ్డున పడ్డ ఆటోడ్రైవర్ల బతుకులు డేంజర్‌జోన్‌లో పడుతున్నాయి. ఓ వైపు గిరాకీ లేక ఇల్లు గడవటమే కష్టంగా మారుతున్న ఆటోవాలాలకు ఇప్పుడు ఈఎంఐలు చెల్లించకపోతే చంపేస్తామంటూ బెదిరింపులు వస్తున్నాయని బిక్కుబిక్కుమంటున్నారు. నెలనెలా కిస్తీలు చెల్లించని వారికి ఆటోఫైనాన్షియర్ల నుంచి హెచ్చరికలు వస్తున్నాయి. మార్గంమధ్యలోనే రోడ్డుపై ఆటో ఆపి డ్రైవర్‌ను బెదిరించటం, కొట్టడం లాంటివి చేస్తున్నారని వాపోతున్నారు. రౌడీషీటర్లను పంపించి కిస్తీ కడతావా? లేదా ఆటో గుంజుకుపోవాలా? అంటూ వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిరాకీ లేక రెండు నెలల కిస్తీలు కట్టలేకపోతే ఆటోలను గుంజుకపోతున్నారని, ఇన్నేండ్లు కట్టిన కిస్తీలు పనికిరాకుండా పోతున్నాయని కన్నీటి పర్యంతమవుతున్నారు. ఉచిత బస్సు స్కీం ప్రవేశపెడితే ఆటో డ్రైవర్లు నష్టపోతారని కాంగ్రెస్ ప్రభుత్వం ఇసుమంతైనా ఆలోచన చేయకపోవటం దురదృష్టకరం అని అంటున్నారు. ప్రభుత్వం స్పందించి ఆటోవాలాలను ఆదుకోవాలని కోరుతున్నారు. ఆటోడ్రైవర్ల చావులకు కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.*

### ఆటోడ్రైవర్లంటే సీఎంకు ఎందుకు లెక్కలేదు



నెలకు రూ.9,500 ఈఎంఐ చెల్లించాలి. ఇవికాక ఇల్లు గడవాలి అంటే ఎలా సాధ్యమవుతుంది ఈ కాంగ్రెస్ పాలనలో. సీఎం రేవంత్‌రెడ్డి అందరినీ సమానంగా చూడాలి. మా ఆటోడ్రైవర్లను ఎందుకు పట్టించుకోవటం లేదు? నాకు నలుగురు పిల్లలు. మరికొన్ని రోజుల్లో బడులు ప్రారంభం కాబోతున్నాయి. మా బాధలు వినేవారే కరువయ్యారు. ఫైనాన్షియర్లు డబ్బులు చెల్లించకపోతే కొడుతుండ్రు. గిరాకీయేమో లేదు. ప్రభుత్వం స్పందించి మా సమస్యలను పరిష్కరించాలె. **- సయ్యద్ జావెద్, ఆటోడ్రైవర్**

### చస్తే చావు.. ఈఎంఐ చెల్లించాల్సిందే అంటున్నారు



నాకు ఇద్దరు పిల్లలు. ఉపాధి కోసం మహబూబ్‌నగర్ నుంచి ఇక్కడికి వచ్చి పదేండ్ల నుంచి ఆటో నడుపుకుంటున్నా. నెలకు రూ.8 వేలు ఈఎంఐ చెల్లించాలి. నా ఆటోను రోడ్డుపై ఆపి నన్ను దించేసి బండి తీసుకెళ్లారు. మళ్లీ అప్పుజేసి ఆ డబ్బులు చెల్లించి వెనక్కి తెచ్చుకున్నా. అలా వెనక్కి తెచ్చుకోవడానికి వారి కమీషన్ డబ్బులు, వడ్డీ, ఈఎంఐలు చెల్లించాల్సి వచ్చింది. ఎలా చూసినా మాకు నష్టమే. ప్రభుత్వం మా సమస్యలను పరిష్కరించకపోతే డ్రైవర్లకు ఆత్మహత్యలు చేసుకోవాల్సిన దుస్థితే వస్తుంది. **- శివ, ఆటోడ్రైవర్**

### చెల్లించిన ఈఎంఐలు వృథా అయినట్టే



నెలకు రూ.13 వేల ఈఎంఐ చెల్లించాలి. గిరాకీ లేదు. ఏం చేయాలి? ఆటోను వదిలేసుకోవాలి. ఆటోను వదిలేస్తే బతకడం ఆపేయ్యాలి. ఎదుటి వ్యక్తికి ఏదైన చిన్న ఆపదొచ్చినా సాయం అందించే వ్యక్తులు ఉంటారు. కానీ ప్రభుత్వం ఇంత ఘోరంగా 4 లక్షల మంది ఆటోడ్రైవర్ల జీవితాలతో చెలగాటమాడుతున్నది. ఇప్పటికీ సీఎం రేవంత్‌రెడ్డి పట్టించుకోకపోవటం దారుణం. ఇప్పటికే రూ.1.80 లక్షలు చెల్లించా. ఇప్పుడు ఈఎంఐ ఆలస్యం కావటంతో ఆటో గుంజుకుపోతే ఆ చెల్లించిన సొమ్మంతా వృథా అయినట్టే. మాకు ప్రభుత్వం న్యాయం చేయాలి. **- అనిల్, ఆటోడ్రైవర్**

## బీఆర్క్ ఎస్సీ, ఎస్టీ ఆలిండియా టాపర్లు మనోళ్లే

### జేఈఈ మెయిన్ పేపర్ -2 ఫలితాలు విడుదల

హైదరాబాద్, మే 19 (నమస్తే తెలంగాణ) : జేఈఈ మెయిన్ పేపర్ -2 ఫలితాలు విడుదలయ్యాయి. జనవరి, ఏప్రిల్ మాసాల్లో నిర్వహించిన ఈ పరీక్షల ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ఆదివారం విడుదల చేసింది. ఈ పరీక్షలోని బీఆర్క్ కోర్సు ఫలితాల్లో రాష్ర్టానికి చెందిన ముగ్గురు విద్యార్థులు సత్తా చాటారు. ఎస్సీ క్యాటగిరీ ఆలిండియా టాపర్‌గా వివేక్‌జిత్ దాస్ 99.94958 పర్సంటైల్ సాధించాడు. ఆలిండియా ఎస్టీ క్యాటగిరీ టాపర్లుగా బోడ ప్రభంజన్‌దాస్ (99.87978 పర్సంటైల్), బానోత్ రిత్విక్ (99.87978 పర్సంటైల్) నిలిచారు. బీఆర్క్ పరీక్ష ఫలితాల్లో జార్ఖండ్‌కు చెందిన సులగ్న బేసాక్, తమిళనాడు విద్యార్థి ఆర్ ముత్తులు 100 పర్సంటైల్ సాధించారు. బీ ప్లానింగ్‌లో ఏపీ విద్యార్థి కొలసాని సాకేత్‌ప్రణవ్, కర్ణాటక విద్యార్థి అరుణ్‌రాధాకృష్ణన్‌లు 100 పర్సంటల్ సొంతం చేసుకొన్నారు. విద్యార్థులు ఫలితాల కొరకు jeemain.nta.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలి. మొత్తం 99,086 దరఖాస్తులు రాగా, 71,009 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు.

## మూడునెలల్లో సారా నిర్మూలనే లక్ష్యం

### తొలిరోజు లక్షల విలువైన సారా, పానకం ధ్వంసం

హైదరాబాద్, మే 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మూడు నెలల్లో సారా నిర్మూలనే లక్ష్యంగా ఎక్సైజ్ శాఖ ఆదివారం దాడులకు శ్రీకారం చుట్టింది. తొలిరోజే రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో రూ.లక్షలాది విలువైన సారా, బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎక్సైజ్, ఎన్ ఫోర్స్‌మెంట్ యంత్రాంగం ఆధ్వర్యంలో 24 గంటల్లోనే రూ.25 లక్షల విలువైన సారా, వాహనాలు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని, పలువురిని అదుపులోకి తీసుకున్నారు. మహారాష్ట్రలోని లాతూర్ నుంచి నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లికి అక్రమంగా తరలివస్తున్న రూ.5 లక్షల విలువైన బెల్లంతోపాటు రూ.10 లక్షల విలువ చేసే వాహనాలను వారు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ నుంచి వనపర్తి జిల్లాలోని కల్వకుర్తి, కొల్లాపూర్ ప్రాంతాలకు అక్రమంగా తరలివెళ్తున్న బెల్లం, రెండు వాహనాలను, సెల్‌ఫోన్లనూ స్వాధీనం చేసుకొని ఇద్దరిని అరెస్టు చేశారు. వీటి విలువ రూ.10.83 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. ఇంకా వరంగల్, భద్రాద్రి కొత్తగూడెం, భూపాలపల్లి జిల్లాల్లోనూ ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఆయా దాడుల్లో పాల్గొన్న అధికారులు, సిబ్బందిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి అభినందించారు. ఇదే తీరులో అన్ని జిల్లాల్లో వచ్చే మూడు నెలల్లో సారాను అంతం చేసి లక్ష్యాన్ని చేరుకోవాలని పిలుపునిచ్చారు.



## తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

హైదరాబాద్, మే 19 (నమస్తే తెలంగాణ): తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతున్నది. టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి ఆదేశాల మేరకు జేఈవో వీరబ్రహ్మం ఆధ్వర్యంలో ఉన్నతాధికారులు క్యూలైన్లను పర్యవేక్షిస్తున్నారు. వెంగమాంబ అన్నప్రసాద భవనం, తిరుమలలోని అన్న ప్రసాద కౌంటర్లు, నారాయణగిరి ఉద్యానవనాలతో పాటు భక్తుల రద్దీ అధికంగా ఉండే ప్రాంతాల్లో ఆహారం, పాలు, తాగునీరందించేందుకు టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేసింది. శ్రీవారి సేవకులు 1500 మంది 24 గంటలు భక్తులకు సేవలందిస్తున్నారు. ఆక్టోపస్ సర్కిల్‌లో లైన్‌లోకి ప్రవేశించే భక్తులకు 24 గంటల సమయం పడుతున్నది. తిరుపతి గోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవాల్లో శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామివారు కల్పవృక్ష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం రాత్రి గరుడ సేవ ఉంటుందని టీటీడీ అధికారులు వివరించారు. వాహనసేవలో తిరుమలపెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్‌స్వామి, ఆగమ సలహాదారులు సీతారామాచార్యులు, మోహనరంగాచార్యులు, ఆలయ డిప్యూటీ ఈవో శాంతి పాల్గొన్నారు.

## 'టెక్స్13బీ' జన్యువుతోనే సంతానలేమి

### సీసీఎంబీ పరిశోధనలో వెల్లడి

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 19 (నమస్తే తెలంగాణ): సంతానలేమి సమస్యలతో ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది దంపతులు బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆ సమస్యలకు కారణాలను అన్వేషించడంపై సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) దృష్టి సారించింది. పురుషుల్లో 'టెక్స్13బీ' అనే జన్యువు సంతానలేమికి కారణమని గుర్తించింది. తల్లిలోని ఎక్స్ క్రోమోజోము నుంచి మగబిడ్డలకు సంక్రమించే ఈ జన్యువు వల్ల శుక్రకణాలు ప్రభావితమవుతున్నట్టు తాజా పరిశోధనలో తేల్చింది. సీసీఎంబీకి చెందిన డాక్టర్ కే తంగరాజన్ ఆధ్వర్యంలో వివిధ సంస్థలకు చెందిన పరిశోధకుల బృందం నెక్ట్స్ జనరేషన్ సీక్వెన్సింగ్ విధానాన్ని ఉపయోగించి ఎలుకలపై ఈ పరిశోధన నిర్వహించింది. ఈ పరిశోధన ఆ వివరాలు 'హ్యూమన్ రీప్రొడక్షన్ జర్నల్'లో ప్రచురితమయ్యాయి.

## ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ పేరుతో ఫేక్ కాల్స్

హైదరాబాద్, మే 19 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్ సైబర్ నేరగాళ్లు ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావు ఫొటోను డీపీగా పెట్టుకుని అమాయకులను బురిడీ కొట్టించే ప్రయత్నం చేస్తున్నారు. అప్రమత్తమైన ఆర్టీసీ అధికారులు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సైబర్ క్రైమ్ సీఐ కోమాకుల శివాజీ తక్షణమే స్పందించి సదరు కాల్స్ వివరాలు సేకరించారు. జార్ఖండ్ నుంచి ఈ ఫేక్ కాల్స్ వస్తున్నట్లు తెలుసుకుని బ్లాక్ చేశారు. ఫేక్‌కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, తన ఫొటోతో ఎవరైనా వాట్సాప్ కాల్స్ లేదా సందేశాలు పంపితే ఎవరూ స్పందించవద్దని ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ సూచించారు.

## విద్యా - ఉద్యోగ సమాచారం

### నేటి నుంచి టెట్

**తొలిసారిగా ఆన్‌లైన్‌లో నిర్వహణ • పరీక్షకు 15 నిమిషాల ముందే గేట్లు క్లోజ్**

హైదరాబాద్, మే 19 (నమస్తే తెలంగాణ) : టెట్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలను తొలిసారిగా ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నారు. పరీక్షకు 15 నిమిషాల ముందే సెంటర్ల గేట్లు మూసివేయనున్నారు. మొదటిరోజు పేపర్-2 గణితం, సైన్స్ పరీక్షలు జరుగుతాయి. ఉదయం 9 గంటల నుంచి 11 : 30 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రెండో షిఫ్ట్‌లో పరీక్షలు నిర్వహిస్తారు. పేపర్ -1 పరీక్షను 99,958 మంది, పేపర్ -2 పరీక్షను 1,86,428 మంది అభ్యర్థులు రాయనున్నారు. ఈ సారి 48,582 మంది సర్వీస్ టీచర్లు కూడా టెట్ పరీక్షకు హాజరు కానున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 80 పరీక్షాకేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షకు గంటన్నర ముందు నుంచే అభ్యర్థులను పరీక్షాకేంద్రాల్లోకి అనుమతిస్తారు. అయితే ఆన్‌లైన్ పరీక్షకావడంతో ఒక్కో పేపర్‌కు మూడు రోజుల్లో 6 సెషన్లలో పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో నార్మలైజేషన్‌ను చేపట్టాల్సి ఉండగా, దీనిపై విద్యాశాఖ ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టతనివ్వలేదు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం జూన్ 2నాడు కూడా పరీక్షను నిర్వహిస్తున్నారు.

### నేటి నుంచి దోస్త్ వెబ్ ఆప్షన్లు

హైదరాబాద్, మే 19 (నమస్తే తెలంగాణ): డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలకు నిర్వహించే డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) మొదటి విడత వెబ్ ఆప్షన్లు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ నెల 3న దోస్త్ నోటిఫికేషన్ విడుదల కాగా, 6 నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయి. 25 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. వెబ్ ఆప్షన్లు సోమవారం ప్రారంభం కానుండగా, 30 వరకు మొదటివిడత ఆప్షన్లు ఎంచుకోవచ్చు. జూన్ 3న మొదటివిడత సీట్లు కేటాయిస్తారు. రాష్ట్రంలోని 1,066 డిగ్రీ కాలేజీలుండగా, వీటిల్లో 4,49,449 సీట్లున్నాయి.

### గురుకులాలకు పూర్వవైభవం తీసుకురావాలి

**విశ్రాంత ఐఏఎస్ విజయ్‌కుమార్**



హైదరాబాద్, మే19 (నమస్తే తెలంగాణ): గురుకులాలను మరింత బలోపేతం చేసి, పూర్వవైభవం తీసుకురావాలని సిబ్బందికి విశ్రాంత ఐఏఎస్ విజయ్‌కుమార్ సూచించారు. తెలంగాణ గురుకుల ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ ప్రథమ వార్షికోత్సవం హైదరాబాద్‌లోని డిక్కీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీజీపీఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రౌతు అజయ్‌కుమార్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా అజయ్‌కుమార్ పాల్గొని ప్రసంగించారు. ఇంటర్, పదోతరగతి పరీక్షా ఫలితాల్లో గురుకులాలు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నాయని కొనియాడారు. విజినరీ గురుకుల అల్యూమిని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పరమశివ చొక్కాలింగం మాట్లాడుతూ గురుకులాల్లో మౌలిక వసతుల కల్పనకు పూర్వ విద్యార్థులుగా తాము శాయశక్తులా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఇగ్నో యూనివర్సిటీ డీడీ డాక్టర్ బొల్ల రాజు మాట్లాడుతూ గురుకులాల్లో చదివిన విద్యార్థులు ఉన్నత స్థానాల్లో ఉన్నారని వివరించారు. అనంతరం వందశాతం ఉత్తీర్ణత సాధించిన గురుకుల ప్రిన్సిపాళ్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గురుకుల పూర్వ విద్యార్థులు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జాటోత్ హరికిషన్, డాక్టర్ విజయానంద్, డాక్టర్ చంద్రకాంత్, బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ సొసైటీ ఆర్‌సీవో గౌతంరెడ్డి, మైనార్టీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ సొసైటీ ఆర్ఎల్‌సీ తణుగుల కార్యదర్శి శ్రీకాంత్, ఉపాధ్యక్షురాలు నీరజ, ఉమెన్స్ సెక్రటరీ నీలిమ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

### 40% ఫిట్‌మెంట్ అమలుచేయాలి: ఎస్టీయూ

హైదరాబాద్, మే 19 (నమస్తే తెలంగాణ): ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే 40శాతం ఫిట్‌మెంట్‌తో తెలంగాణ రెండో పీఆర్సీని అమలుచేయాలని స్టేట్ టీచర్స్ యూనియన్(ఎస్టీయూ) రాష్ట్ర ప్రధానకార్యదర్శి జీ సదానందంగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్టీయూ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం కాచిగూడలోని ఎస్టీయూ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సదానందంగౌడ్ మాట్లాడుతూ జీవో -317పై నిర్ణయం తీసుకోవాలని, రెండు పెండింగ్ డీఏలను విడుదల చేయాలని, సీపీఎస్‌ను రద్దుచేయాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని, గురుకులాలు, ఆశ్రమ, మాడల్‌స్కూళ్లల్లో పనిచేస్తున్న టీచర్లకు ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించాలని కోరారు.

### బీసీ గురుకుల జూనియర్ కాలేజీల ప్రవేశపరీక్ష ఫలితాలు విడుదల

హైదరాబాద్, మే19 (నమస్తే తెలంగాణ): తెలంగాణ మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల జూనియర్ కాలేజీల ప్రవేశ పరీక్ష ఫలితాలను https://mjpabcwreis.cgg.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు బీసీ గురుకులాల కార్యదర్శి సైదులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మెరిట్ సాధించిన విద్యార్థులు తమకు కేటాయించిన కాలేజీల్లో ఈ నెల 20 నుంచి 30లోపు రిపోర్ట్ చేయాలని సూచించారు. ఎంపీసీలో 8,624, బైపీసీలో 6,463, ఎంఈసీలో 484, సీఈసీలో 2,676, హెచ్ఈసీలో 229 సీట్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఈ ప్రవేశ పరీక్షను ఏప్రిల్ 28న నిర్వహించిన విషయం తెలిసిందే.

### 'వీసీల నియామకాల్లో బీసీలకే ప్రాధాన్యమివ్వాలి'

హైదరాబాద్, మే19 (నమస్తే తెలంగాణ): యూనివర్సిటీ వైస్ చాన్సలర్, డైరెక్టర్ పోస్టుల్లో 50శాతం పోస్టులను బీసీలతోనే భర్తీ చేయాలని జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్‌యాదవ్ డిమాండ్ చేశారు.ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వీసీల నియామకాల్లో బీసీలకు తగిన ప్రాధాన్యమిచ్చి న్యాయం చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు.